# అపూర్వ సహోదరులు

యం.ఐ. కిషన్



వంటింట్లో స్టవ్వుకి ఒత్తులు మారుస్తున్న కల్పనకి హాల్లోంచి పెద్ద పెట్టున శ్రీమగాడి ఏడుపు వినిపించింది.

ఈవెధవలిద్దరూ మళ్ళీ కొట్టుక్కు ఛస్తున్నారులా ఉందనుకొంటూ ఒక్క పరుగున ఆమె హాల్లోకొచ్చింది.

కరక్టే! నిజంగానే వాళ్ళిద్దరూ కొట్టుక్కు ఛస్తున్నారు.

శ్రీమగాణ్ణి వెల్లకిలా పడేసి వాడిపొట్టమీద ఎక్కి కూర్చుని తన బలాన్నంతా ఉపయోగిస్తూ వాడి జుట్టు పీకుతున్నాడు మురారి. ఒక ప్రక్క ఏడుస్తూనే మురారి వీపు మీద దభీ దభీ మని బాదుతున్నాడు శ్రీమ.

ముందరందీ? ముందు నువ్వేగా నన్ను బొక్కిపళ్ళన్నావ్'''

"హోర్నుయ్! నేనేం అన్లేదు ముందు. ముందు నువ్వు తారన్నాకే నేన్నిన్ను బొక్కిపళ్ళన్నాను. "ఎక్కువగా వాగితే మళ్ళీ తన్నగలను సుమా! అన్నట్లుగా పోజు పెట్టాడు మురారి.

"చూడమ్మా ఎలా చూస్తున్నాడో గుడ్లగూబ గుడ్లేస్కుని" అంటూ తల్లిని వాటేసుకున్నాడు శ్రీమా.

"నీవే గుడ్లగూబ గుడ్లు"

"ఏడిశావ్ నీవే గుడ్లగూబ గుడ్లు! నీదే పంది ముట్టె.

మళ్ళీగనక ఒకడిజోలొకడు తీశారంటే ఇద్దరికీ వీపులుపగిలిపోతాయ్ ఏవనుకుంటున్నారో. ఆ!... జాగ్రత్త! కిక్కురుమన్న శబ్దంగాని వినిపించిందా మీ పన్నెండన్నమాటే!" హుంకరించి వంటింట్లోకి వెళ్ళిపోయింది కల్పన.

"ఒరే ర్యాస్కల్ ముండాకొడుకుల్లారా! మళ్ళీ ఏవొచ్చిందిరా మీకు?" వాళ్ళని విడదీస్తూ మురారి కేసి గుడ్లురిమి చూసింది కల్పన.

తల్లి తంతుందేమోనన్న భయంకొద్దీ ఒకింత ఎడంగా వెళ్ళి నిలబడ్డాడు వాడు "నన్ను తారని ఎందుకనాలి మరి?" అన్నాడు రొప్పుతూ.

అన్నకేసి తినేశాలా చూశాడు శ్రీమ "నేనేంటయ్యా నీదే చుంచు మొఖం" అమ్మ దగ్గిరే ఉంది కాబట్టి ఈసారి అన్న తననేం చెయ్యలేడన్న ధీమాతో పెద్ద మొగాడిలా నడుం మీద చేతులు వేసుకుని నిలబడ్డాడు శ్రీమ.

"చూడమ్మా మరి..." ఫిర్యాదు చేశాడు మురారి

."ఏంట్రా చూసేది? ముయ్యండి నోళ్ళు. ఇద్దర్లో ఎవరన్నా నోరు తెరిచారంటే ఇద్దరికీ తగుల్తాయ్! అబ్బబ్బబ్బ... పొద్దస్తమానం కొట్టుకుచావడమే గదా! మీరెక్కడ దొరికార్రా నా ప్రాణానికి? ఏ జన్మలోనో మీరిద్దరూ శత్రువులయ్యుంటారు" అంటూ నుదుటి మీద బాదుకొంది కల్పన.

గత జన్మలో వాళ్ళు శత్రువులవునోకాదో గాని మొత్తానికి ఆమె అన్నది నిజమే. తెల్లారి లేచింది మొదలు వాళ్ళిద్దరూ దేనికో ఒకదానికి కొట్టుకుంటూనే ఉంటారు.

మురారికి ఏడేళ్ళు. వాడు కాస్త నలుపు. కాస్తేవిటి కారు నలుపు. అందుకని వాణ్ణి "తారు" అని ఎగతాళి చేస్తుంటాడు శ్రీమా.

శ్రీమకి ఎనిమిదేళ్ళు. ఈ మధ్యనే వాడి ముందరి పళ్ళు రెండూడినై.కొత్త పళ్ళింకా రాలేదు. అందుకని వీణ్ణి బొక్కి పళ్ళంటాడు మురారి.

ఇద్దరూ మారు పేర్లతో ఒకర్నొకరు ఎగతాళి చేసుకుని నువ్ ముందన్నావంటే నువ్ ముందన్నావంటూ కనీసం రోజుకి రెండుసార్లైనా కుస్తీపట్లు పడుతుంటారు.

ఓ గంట క్రితమే తన పుస్తకం లోంచి శ్రీమా నెమలి ఫించాన్ని కాజేశాడన్న నెపంతో వాడి వీపు పగలకొట్టాడు మురారి. వాడేమో ఏకంగా పడక్కుర్చీ కర్రని బైటకి లాగి దాంతో వడ్డించాడు మురారిని. అంతే! అది కాస్తా ముదిరి వాళ్ళిద్దరూ కాట్ల కుక్కల్లా దెబ్బలాడుకోవడం కల్పన జోక్యం చేసుకుని ఇద్దర్నీ చెరొందు తిట్టి విడదియ్యడం జరిగింది. ఇంతలోనే మళ్ళీ ఈ గలభా!

మళ్ళీ గనక ఒకడి జోలొకడు తీశారంటే ఇద్దరికీ వీపులు పగిలిపోతాయ్ ఏవనుకుంటున్నారో ఆ!.. జాగ్రత్త కిక్కురుమన్న శబ్దం గాని వినిపించిందా మీ పన్నెండన్న మాటే!" అంటూ హుంకరించి తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది కల్పన.

. అన్నదమ్ములిద్దరూ ఒకరికేసొకరు మింగుదామా కరుద్దామా అన్నట్లు చూస్తూ నిలబడ్డారు.

మధ్యాహ్నం భోజనానికి ఆఫీసు నుండి ఇంటికొచ్చిన భర్తతో "ఈ వెధవలిద్దరితో నేను వేగలేకపోతున్నానండీ! ఒక్క క్షణం తిన్నగా ఉండరు. ఏదో ఒక వంకన ఇరవై నాలుగ్గంటలూ తన్నుకోవడమే" అంటూ పొద్దుట్నుంచి అప్పటిదాకా ఏయే వంకన ఎన్నిసార్లు వాళ్ళిద్దరూ కొట్టుకున్నారో వివరించి "ఈ చిన్న వెధవ ఏకంగా పడక్కుర్చీ కర్రతో వేసేశాడు మురిగాణ్ణి. కాలి మీద తగిలింది కాబట్టి సరిపోయింది. అదే ఏ తగ్గరాని చోట్లోనో తగిలితే ఇంకేవన్నా ఉందా! పామూ, ముంగిసల్లా ఒకడంటే ఒకడుకుండి ఛస్తారు. లాభం లేదండీ వీళ్ళిద్దర్నీ కలిపి ఉండనివ్వడం ఏనాటికైనా ప్రమాదమే అంది కల్పన.

సూర్యం నవ్వేస్తూ "చిన్న పిల్లలన్నాక కొట్టుకోకుండానూ తిట్టుకోకుండానూ ఉంటారా! కాస్త ఊహతెలిస్తే వాళ్ళే మారతారు. ఐనా కలిసుండనియ్యక ఏం చేద్దామని" అన్నాడు తేలిగ్గా.

"మీరు వాళ్ళిద్దరూ తన్నుకునేపుడు చూళ్ళేదు కాబట్టే అలా అంటున్నారు. నేనే ఇంట్లోనూ చూళ్ళేదు. మరీ అంత చేటు విడ్డూరం! అన్నదమ్ములన్నాక ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడన్నా సఖ్యంగా ఉంటారు. అబ్బే... వీళ్ళా!?... రాకాసి ముండాకొడుకులు?"

"అంటే నువ్ రాకాసి నన్నమాట?" జోక్ చెయ్యబోయాడు సూర్యం

"అబ్బ మీకంతా ఎగతాళే! చెప్పేది అర్థం చేసుకోరు కదా!" కసిరింది కల్పన.

'అర్థమైంది లేవే... ఇంతకీ ఏం చేద్దామంటావ్?"

"ఇద్దర్లో ఒకణ్ణి కొన్నాళ్ళపాటు మా అన్నయ్యఇంట్లో ఉంచుదాం. అప్పుడు తెలిసొచ్చుద్ది!"

"కల్పన అన్నయ్య రాఘవరావు ఆ ఊళ్ళోనే ఉంటున్నాడు. వీళ్ళింటికి వాళ్ళ ఇళ్ళు అట్టే దూరం కూడా కాదు. తనయుల్లో ఒకణ్ణి అక్కడికి ట్రాన్స్ఫర్ చేస్తే ఇంట్లో కీచులాటలు తప్పుతాయని కల్పన ఉద్దేశ్యం. చాన్నాళ్ళుగా ఆమెకాఉద్దేశం ఉంది. అయితే భర్త ముందు బయటపడటం అదే మొదటిసారి.

"మీ అన్నయ్యకీ ఉన్నారుగా ఇద్దరు కోతులు. అక్కడికి పంపితే వాళ్ళతో మాత్రం తగవులు పెట్టుకోరని గ్యారంటీ ఏక్కడుంది?"

"అదేం జరగదు లెండి. మా అన్నయ్య కొడుకులిద్దరూ పెద్దోళ్ళు. వాళ్ళకీ వీళ్ళకి పోలికేంటి? ఇక్కడంటే ఇద్దరూ సుమారుగా సమానమైన ఈడువాళ్ళు కాబట్టే తన్నుకు ఛస్తున్నారు. అక్కడికివెళ్తే బుద్ధిగానే ఉంటారు. అదీగాక నా అనుమానమేమిటంటే వీళ్ళిద్దరూ ఏ జన్మలోనో శత్రువులయ్యుంటారని"

"ఏ మొహం! పిల్లలన్నాక ఏ ఇంట్లోనైనా అంతే! సర్లే ఇంతకీ ఎవణ్ణి పంపిదామంటావ్"

"మురిగాణ్ణి పంపుదాం!"

ప్రక్కగదిలోంచి ఆ సంభాషణంతా ఆలకిస్తున్న మురారి "భలే భలే" అంటూ చంకలు గుద్దుకున్నాడు. నేను మావయ్య వాళ్ళ ఇంటికి వెళ్ళిపోతున్నానోచ్ అక్కడ సుధీర్ బావ బోల్డన్ని గాలిపటాలు చేస్తడోచ్" అంటూ తమ్ముణ్ణి ఊరించాడు. వాణ్ణి ఒక్కతోపు తోసి అమ్మా నాన్నలదగ్గరికి పరిగెత్తుకెళ్ళాడు శ్రీను.

"అమ్మా నేను కూడా వెళ్తానే మావయ్య వాళ్ళ ఇంటికి" అన్నాడు గారాలు పోతూ.

"ఎందుకూ ఇద్దరూ వెళ్ళి అక్కడ కూడా కొట్టుకుచావడానికా?" అంది కల్పన.

"కొట్టుకోం" హామీ ఇచ్చాడు.

"మరైతే ఇక్కడెందుకు కొట్టుకుంటున్నార్రా?" నవ్వుతూ అడిగాడు సూర్యం.

"ఉత్తినే నాన్నా! అసల్నేనేం కొట్టను అన్నే ముందు నన్ను కొడతాడు."

నువ్ తారంటావ్ గాబోలు.. వాడు కొడతాడు"

"ముందు నన్ను బొక్కి పళ్ళంటాడుగా మరి?" బుంగమూతి పెట్టాడు శ్రీను.

"నీవి బొక్కిపళ్ళేగా మరి?" అని నవ్వేస్తూ సర్లే ఆలోచిద్దాంలే గాని నాకు టైమవుతోంది వడ్డించు" అన్నాడు సూర్యం భార్యతో.

ఆ కార్యక్రమంలో పడింది కల్పన.

'అన్నట్లు వీళ్ళు బడిలో కూడా ఇంతేనటా?"

'ఏమో ఎవరు చూశారు? మొత్తానికి బణ్ణుంచొచ్చేటపుడు మాత్రం ఏదో ఒక కంప్లైంట్ లేకుండా రారు" చెప్పింది కల్పన కంచం తొలూస్తూ.

ఆ రోజు నవంబరు పధ్నాలుగు! చిల్డ్రన్స్ డే! అందుచేత పిల్లలకి బడిలేదు. బడి ఉన్న రోజుల్లో కొంత నయమే గాని శలవు రోజుల్లో మాత్రం వాళ్ళతో చచ్చేంత చావు కల్పనకి.

* * *

భోజనానంతరం మధ్యాహ్నపు పూట ఓ కునుకు తియ్యటం కల్పనకి రోజూ ఉన్న అలవాటే!

"అమ్మా అమ్మా అమ్మా" అంటూ శ్రీను కుదపటంతో అప్పుడే అలా కళ్ళు మూసిన కల్పన ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది.

"మరే... మరే... అన్నయ్యే..."

'ఊ ఏవిటి? మళ్ళీ అప్పుడే మొదలెట్టేశారా కొట్లాట?"

"అది కాదమ్మా! మరే ఆ కిట్టుగాడు లేడూ? వాడే... అన్నయ్యని తన్నేస్తున్నాడు. అన్నయ్య కిందపడి పోయి ఏడుస్తున్నాడమ్మా.. తొందరగా రా" అంటూ చెయ్యి పట్టి గుంజాడు శ్రీను.

"అబ్బ ఎక్కడి పిల్లల్రా మీరు" వాడితో ఎందుకు పెట్టుకున్నారు!" బద్ధకంగా లేస్తూ అంది కల్పన.

"మరేమో... కిట్టుగాడు నన్ను బొక్కిపళ్ళన్నాడమ్మా!

"అన్నయ్యేమో.. ఎందుకురా మా తమ్ముణ్ణి బొక్కిపళ్ళన్నావ్? తంతాన్తెలుసా? అన్నాడమ్మా! అనగానే ఆ కిట్టుగాడు అన్నయ్యని చెంపమీద ఒక్కటిచ్చాడమ్మా!






అన్నయ్య మళ్ళీ వాణ్ణి కొట్టబోతే కిందపడేసి చితకాయతకా తన్నేస్తున్నాడమ్మా! అన్నయ్యకి దెబ్బలు కూడా తగిలాయమ్మా! తొందరగా రా!"

శ్రీనుగాడు వెంటరాగా దెబ్బలాట స్పాట్కి వెళ్ళింది కల్పన. ఆమె రావటం చూసి మురార్ని వదేసి తంతున్న కిట్టు పరుగు లంకించుకున్నాడు. కిట్టూ అంటే పక్కింటి వాళ్ళబ్బాయి.

మురారికి దెబ్బలు ఓ మోస్తరుగానే తగిలాయ్. కల్పనకి కిట్టూమీద ఒళ్ళు మండిపోయింది. మురార్ని ఈడ్చుకుంటూ కిట్టూ వాళ్ళ ఇంటికి వెళ్ళింది. వాళ్ళ అమ్మతో ఫిర్యాదు చేయటానికి.

విషయం విన్న సుమిత్ర కిట్టూ వాళ్ళ అమ్మ ఏడి ఏడంటూ వాడి కోసం అటూ ఇటూ చూసి ఎక్కడికి పోయాడో వదినా!.. రాగానే బాగా బుద్ధి చెప్తాలే. నువ్వేం బాధపడకు" అంటూ కల్పనకి సర్దిచెప్పి పంపించింది.

ఇంటికి రాగానే బయటికెక్కడికి వెళ్ళకుండా బుద్ధిగా ఇంట్లోనే ఉండి ఆడుకోండి" అంటూ పిల్లలకు వార్నింగ్ ఇచ్చి మళ్ళీ మంచం మీద మేను వాల్చింది కల్పన. పిల్లలిద్దరూ మాట్లాడుకుంటుంటే ఓ చెవి వటు



పారేసింది.

"ఆ కిట్టు వెధవ జట్టు మనవింకెప్పుడూ ఉండొద్దన్నయ్యా"

"అవున్రా వాడు భలేకంత్రీ వెధవ!"

"పోనీ అంటే అన్నాడు బొక్కిపళ్ళవి, నువ్వూరుకోవాల్సిందన్నయ్యా వాడు దుక్కముక్కలా ఉంటాడు వాణ్ణే మనం కొట్టలేం"

"ఏడిశాడు ఇవ్వాళంటే ఓడిపోయాను గాని ఇంకోసారెప్పుడైనా ఆన్ని విన్ను బొక్కిపళ్ళవి నా తడాఖా చూపిస్తాను"

వద్దన్నయ్యా! వాడితో నువ్ చాల్లేవ్! మనం అసలు వాడి జోలికే వెళ్ళొద్దు"

'నీకు తెలీదురా! మనం ఊరుకుంటే అలుసైపోమూ? పోనీలే అని ఊరుకున్నాం అనుకో... ఇదే పందిని వాడు నిన్ను రోజూ బొక్కిపళ్ళంటాడు. నన్ను తారని కూడా అంటాడు. అందుకే ఊర్కోకూడదు మనం"

కల్పన పెదవులపై చిరునవ్వు విరిసింది. ఎంత తిట్టుకున్నా తిన్నుకున్నా వాళ్ళిద్దరూ అన్నదమ్ములు. ఒక గూటి పక్షులు ఆ మమకారం ఎక్కడికి పోతుంది. అనుకుంది మనసులో తృప్తిగా. ఒరే వేణ్ద్రపోవాలి మెల్లిగా మాట్లాడుకోండ్రా అని హెచ్చరించి ప్రక్క కొరిగింది.

ఆ రాత్రి భోజనాలు చేస్తుండగా పొద్దున్నే అన్నావుగా రేపు మీ అన్నయ్యని పిల్చుకురమ్మంటావా" అన్నాడు సూర్యం కల్పనతో

"మీకెవన్నా తిక్కా! పొద్దున్న నేనేదో మాట వరసకంటే ఇంకా అదే పట్టుకూర్చున్నారా?" అంది కల్పన మాట సాగదీస్తూ

ఇది మరీ బాగుంది. పిల్లలన్నాక కొట్టుకోకుండా ఉండరే బాబూ అని పొద్దున్ననేనంటే ఏదో వాగింది నువ్వే మళ్ళీ నాకు తిక్కంటగడుతున్నదీ నువ్వే, నీకా తిక్క నాకా.

"తిక్కో పాడో గాని అదంతే లెండి" అంది కల్పన సూర్యం అర్థం కానట్లుగా ముఖం పెట్టాడు. *



